సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 15 । నవంబర్ । 2024



క్వారీలో జంగల్ సఫారీ

క్వారీలో జంగల్ సఫారీకి అటవీశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వారంలో ప్రారంభాని కి చర్యలు తీసుకుంటున్నారు. ఏర్పాట్లను అటవీ రేంజ్ అధికారి సుభాష్ పరిశీలించారు. 8లో▸



కార్తిక పూజలు

దండేపల్లి: మండలంలోని గూడెం సత్య నారాయణస్వామి ఆలయంలో కార్తిక పూజలు కొనసాగుతున్నాయి. గురువారం భక్తులు అధిక సంఖ్యలో సత్యదేవుణ్ణి దర్శించుకున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /20.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉత్తరం దిశగా గాలులు వీస్తాయి. చలి తీవ్రత మరింతగా పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

నెన్నెల: వరిపంటను సకాలంలో కోసి నాణ్యత ప్ర మాణాలు పాటిస్తే మద్దతు ధర లభిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ రైతులకు సూచించారు. గురువారం నెన్నెల రైతువేదికలో వరి ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు. వరి, పత్తి కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అదనపు కలెక్టర్ మోతిలాల్ మాట్లాడుతూ వరి పంట పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాతే కోతలు ప్రారంభించాలని అన్నారు. 80 నుంచి 90 శాతం వరి గొలుసులు పసుపు రంగుకు మారుతున్న సమయంలో పంటను కోయాలని తెలిపారు. రాత్రి సమయంలో మంచు తగలకుండా ధాన్యం కుప్పపై కవర్లు కప్పాలన్నారు. సన్నరకం వడ్లకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తుందని, 48 గంటలలో నగదు చెల్లించేలా చర్యలు తీసుకుంటోందని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లయి అధికారి బ్రహ్మారావు, సివిల్ సప్లయి మేనేజర్ శ్రీకళ, బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణ, భీమిని ఏడీఏ సురేఖ, తహసీల్దార్ రమేష్, ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఉద్యోగుల నిరసన



నిరసనలో ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు

మంచిర్యాలటౌన్: వికారాబాద్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులపై జరిగిన దాడులను ఖండిస్తూ జిల్లా కలెక్టరేట్ ఎదుట గురువారం తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు జిల్లాకు చెందిన ఉద్యోగులు భోజన విరామం సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు కూడా ప్రజల్లో భాగమేనని అన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో ప్రజలకు మేలు చేసే వారిపై ఉద్దేశపూర్వకంగా దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ సభ్యులు, ఉద్యోగుల జేఏసీ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టాలి



మోదీకి ఉత్తరాలు పంపిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: వచ్చే ఏడాది కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. బీసీ కులగణన చేపట్టాలని గురువారం మంచిర్యాల నుంచి ప్రధానమంత్రికి మోదీకి చేరే విధంగా ఉత్తరాలు పోస్ట్ చేశారు. నాయకులు మాట్లాడుతూ బీసీలకు 50శాతం రిజర్వేషన్ల అమలు కోసం దేశవ్యాప్తంగా చర్చ నడుస్తోందని, బీసీ కులగణన చేపడితే రిజర్వేషన్లు పెంచాల్సి వస్తుందనే భయంతో ప్రభుత్వం వెనుకాడుతోందని అన్నారు. బీసీలకు ఇవ్వాల్సిన ప్రజాస్వామ్య వాటా ఎన్ని రోజులు ఇవ్వకుండా దాటవేస్తారని ప్రశ్నించారు. బీసీలకు రిజర్వేషన్ల కేటాయింపులో అన్యాయం జరుగుతోందని, బీసీల కులగణనకు 27 రాజకీయ పార్టీలు కేంద్రానికి లేఖలు రాశాయని, 10 రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీల్లో తీర్మానాలు చేసి పంపించాయని, అయినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, సీనియర్ నాయకులు కర్రె లచ్చన్న, బీంసేన్, రమణాచారి, బండ సతీష్, రాజేశం, అందే సంతోష్, కుమార్, సురేందర్‌చారి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బియ్యం.. చేతికి నగదు..!

- కిలోకు రూ.15 చొప్పున అందజేత
- దర్జాగా రేషన్ బియ్యం పక్కదారి
- ప్రతీనెల కోటా డ్రా కోసం బయోమెట్రిక్

మంచిర్యాలక్రైం/దండేపల్లి: నిరుపేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వాలు ఉచితంగా చౌక ధరల దుకాణాల్లో పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. గతంలో కొందరు రేషన్ బియ్యం దళారులకు విక్రయించి నగదు తీసుకోగా.. ప్రస్తుతం పంథా మారింది. రేషన్ దుకాణాల వద్దనే బియ్యం దందా బాహాటంగా సాగుతోంది. కొన్ని చోట్ల రేషన్ డీలర్లే దళారుల అవతారమెత్తి బియ్యం పంపిణీని నగదు బదిలీ పథకంగా మార్చేసి దందా సాగిస్తున్నారు. బియ్యం కోటాకు బదులుగా కిలో బియ్యానికి రూ.12 నుంచి రూ.14వరకు లెక్కగట్టి మరీ కార్డుదారులకు నగదు అందిస్తున్నారు. కరోనా కాలం నుంచి ఆహార భద్రత కార్డుదారులకు ఉచిత బియ్యం పథకం కొనసాగుతూ వస్తోంది. ఈ బియ్యం తినలేని కుటుంబాలు కేవలం తమ రేషన్‌కార్డును కాపాడుకునేందుకు నెలవారీగా బియ్యం కోటా తీసుకుని దళారులకు విక్రయిస్తున్నారు. తాజాగా రేషన్‌డీలర్లే ఆ బియ్యం కొనుగోలుకు తెరతీయడంతో లబ్ధిదారులు నేరుగా వెళ్లి బయోమెట్రిక్ వేసి నగదు తీసుకోవడం పరిపాటిగా మారింది. దీంతో బియ్యం అటు నుంచి అటే బ్లాక్‌మార్కెట్‌కు తరలిపోతోంది. బియ్యం పక్కదారి పట్టకుండా సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వం ఈ–పాస్ అమలు చేస్తోంది. లబ్ధిదారుల బయోమెట్రిక్, ఐరిస్, ఓటీపీ తప్పనిసరిగా మారింది. దీంతో డీలర్లు లబ్ధిదారుల ఆమోదంతో ఈ–పాస్‌పై కార్డుదారుల బయోమెట్రిక్ తీసుకుని నగదు చెల్లిస్తున్నారు. ఫలితంగా బియ్యం పక్కదారికి అడ్డుకట్ట పడడం లేదు.

అనర్హులే అధికం..!

జిల్లాలోని అన్ని రకాల రేషన్‌కార్డుదారుల కోసం ప్రతీ నెల 9వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సరఫరా చేస్తోంది. జిల్లాలో ఉన్న రేషన్‌కార్డుల్లో సగానికి పైగా అనర్హత కలిగిన కుటుంబాలు ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రేషన్‌కార్డు బహుళ ప్రయోజనకారి కావడంతో నిరుపేదలతోపాటు ఆదాయ వర్గాలు కూడా కార్డులు పొందుతున్నారు. వారికి రేషన్ బియ్యం అవసరం లేకపోయినా కార్డు రద్దు కాకుండా ఉండడం కోసం అప్పుడప్పుడు బియ్యం కోటా తీసుకుంటున్నారు. ఇడ్లీ, దోశల కోసం కొందరు కొంత బియ్యం తీసుకుని మిగతా వాటిని విక్రయిస్తున్నారు.



టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం(ఫైల్)

కిలో బియ్యం రూ.32.94

రేషన్‌దుకాణాల్లో పేదలకు బియ్యం పంపిణీ కోసం కిలోకు రూ.32.94 ఖర్చు చేస్తోంది. వాస్తవంగా కిలో బియ్యం ధర రూ.31 పలుకుతుండగా.. రవాణా, నిర్వహణ కలిపి అదనంగా రూ.1.94 వ్యయం అవుతోంది. లబ్ధిదారులు మాత్రం తమ కోటా బియ్యాన్ని తక్కువ ధరకే విక్రయిస్తున్నారు.

రోజుకు రూ.కోటి..

గ్రామాల్లోని కొందరు కిరాణదుకాణదారుల, రేషన్ వ్యాపారులు నియమించిన కమీషన్ ఏజెంట్లు వినియోగదారుల నుంచి రూ.10 నుంచి రూ.15కు కిలో చొప్పున కొనుగోలు చేసి క్వింటాళ్లలో జమ చేస్తున్నారు. బియ్యం వ్యాపారుల నుంచి రూ.2 నుంచి రూ.5చొప్పున కమీషన్ తీసుకుని అప్పగిస్తున్నారు. బియ్యం వ్యాపారులు టన్నులకొద్ది బియ్యం అర్ధరాత్రి సమయంలో ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు మిల్లర్లకు కిలో రూ.20చొప్పున విక్రయిస్తున్నారు. కొందరు వ్యాపారులు రేషన్ బియ్యాన్ని నూకలుగా మార్చి కోళ్ల దాణాకు విక్రయిస్తున్నట్లు సమాచారం. రామగుండం పోలీసు కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల వరుస దాడుల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణా వెలుగు చూస్తోంది. పోలీసు అంచనా ప్రకారం ప్రతీరోజు జిల్లా నుంచి మహారాష్ట్రకు సుమారు రూ.కోటి విలువైన రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు అడపాదడపా చేసిన దాడుల్లోనే క్వింటాళ్ల కొద్ది రేషన్ బియ్యం పట్టుబడడం గమనార్హం. ఓ వైపు దళారులు, మరోవైపు డీలర్లు బియ్యం పక్కదారి పట్టిస్తుండగా.. అరికట్టాల్సిన పౌరసరఫరాల శాఖ మామూలుగానే వ్యవహరిస్తోందనే ఆరోపణలున్నాయి.

జిల్లా వివరాలు

రేషన్ దుకాణాలు	423
ఆహార భద్రతకార్డులు	1,98,649
అంత్యోదయ కార్డులు	15,417
అన్నపూర్ణ కార్డులు	170

పీడీ యాక్ట్ నమోదు చేస్తాం..



అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తాం. అక్రమ రవాణా ఏదైనా సరే వదిలి పెట్టేది లేదు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీమ్ పనిచేస్తోంది. ఇప్పటికే చాలా కేసులు నమోదు చేశాం. కొందరు అదే దందా సాగిస్తున్న వారిని గుర్తించాం. త్వరలో వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తాం. అక్రమ రవాణా నిరోధానికి ప్రజలు సహకరించాలి. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం.

– ఎం.శ్రీనివాసులు, రామగుండం పోలీస్ కమిషనర్

కఠిన చర్యలు తప్పవు..

రేషన్ బియ్యం అక్రమ దందాపై నిఘా పెట్టాం. పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. పట్టుబడిన బియ్యం కేసులపై కఠిన చర్యలు తప్పవు. క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తాం.

– బ్రహ్మారావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, మంచిర్యాల

నెలరోజుల వ్యవధిలో పట్టుబడిన బియ్యం

అక్టోబర్‌లో..
- 3న హాజీపూర్‌లో క్వింటాలున్నర
- 6న భీమినిలో 10 క్వింటాళ్లు
- 9న రామక్రిష్టాపూర్‌లో 26 క్వింటాళ్లు
- 10న కన్నెపల్లి మండలం వెంకటాపూర్‌లో 13 క్వింటాళ్లు

నవంబర్‌లో..
- 5న జైపూర్‌లో 20 క్వింటాళ్లు
- 6న మంచిర్యాల పట్టణంలో 5 క్వింటాళ్లు
- 11న దండేపల్లి మండలం గూడెం సమీపంలో 20 క్వింటాళ్లు

క్రీడలతో విద్యార్థులకు భవిష్యత్

- పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ



బహుమతి ప్రదానం చేస్తున్న ఎంపీ, కలెక్టర్

లక్సెట్టిపేట: క్రీడలతో విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న జోనల్‌స్థాయి క్రీడా పోటీలు గురువారం ముగిసాయి. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా ఉన్నత చదువులు, ఉద్యోగాలకు మంచి అవకాశాలు ఉంటాయని అన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల ఉన్నత చదువుల కోసం కృషి చేస్తోందని అన్నారు. గెలుపోటములు సహజమని, ఓడిపోయిన వారు గెలుపు కోసం ప్రయత్నించాలని అన్నారు. 15పాఠశాలల నుంచి 1275మంది క్రీడాకారులు హాజరయ్యారు. చిట్యాల నుంచి పాల్గొని చాంపియన్ షిప్ గెలిచిన క్రీడాకారులకు కప్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమాకళ్యాణి పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



నెహ్రూ చిత్రపటానికి ఉద్యోగులు, విద్యార్థుల నివాళి

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 14నుంచి 20 వరకు వారోత్సవాలు నిర్వహించనున్నారు. బాలల దినోత్సవం సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్లు రమేష్, మురీ, ఉపాధ్యాయులు గీత, శైలజ పాల్గొన్నారు.

భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలి

నస్పూర్: నేటి సమాజంలో బాలబాలికలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని జిల్లా మహిళా శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని బాలసదనంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నెహ్రూ దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో వినూత్న కార్యక్రమాలు ప్రవేశపెట్టారని తెలిపారు. అనంతరం పిల్లలకు ఆట వస్తువులు, స్కూల్ బ్యాగులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి స్వరూపారాణి, అధికారులు ఆనంద్, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న కలెక్టర్

వ్యాక్సినేషన్ ప్రక్రియ పూర్తి స్థాయిలో జరగాలి

నస్పూర్: పిల్లలకు వ్యాక్సినేషన్ పూర్తి స్థాయిలో అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నస్పూర్ పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ భవనంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారి హరీష్‌రాజ్‌తో కలిసి మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లకు టీకాల కార్యక్రమం సూక్ష్మ ప్రణాళిక అమలుపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు పుట్టినప్పటి నుంచి పోలియో వ్యాక్సిన్, డీపీటీ, బీపీటీ, మిజిల్స్ రూబెల్లా, హైపటైటిస్ ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు అనిత, సుధాకర్‌నాయక్, అతుల్, జ్యోత్స్న, డేవిడ్, పద్మ, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ ప్రారంభం

నస్పూర్: ఈ నెల 15న ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం ప్రారంభం అవుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని కలెక్టరేట్‌లో ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని గిరిజన సంఘాల నాయకులు, మేధావులు, యువతీ, యువకులు పాల్గొనాలని కోరారు.

పరీక్ష ఫీజు రాయితీకి దూరమే..!

- 'పది' విద్యార్థులకు ఇబ్బందులు
- ఆదాయ ధ్రువీకరణ కంటే చెల్లింపే మేలనే భావన

దండేపల్లి: పదో తరగతి విద్యార్థుల కోసం విద్యాశాఖ చాలా ఏళ్ల క్రితం ప్రతిపాదించిన పరీక్ష ఫీజు రాయితీని కొనసాగించడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వాలు మారుతున్నా ఫీజు రాయితీ నిబంధనలో మార్పు లేకపోవడంతో విద్యార్థులు దూరం కావాల్సి వస్తోంది. ఫీజు రాయితీకి ప్రస్తుత పరిస్థితులకు పొంతన లేకపోవడంతో కొన్నేళ్లుగా విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోలేని పరిస్థితి ఎదురవుతోంది. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఈ విద్యాసంవత్సరమైనా నిబంధనలు మారుస్తారని భావించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం 2024–25 విద్యాసంవత్సరానికి పదో తరగతి విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు షెడ్యూల్ ఇటీవల విడుదలైంది. దీంతో విద్యార్థులంతా పరీక్ష ఫీజు చెల్లించే పనిలో నిమగ్నమయ్యారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజులో వందశాతం రాయితీ పొందే అవకాశం ఉంది. కానీ నిబంధనల కారణంగా అది కాస్తా ఉత్తుతి రాయితీగానే మారింది.



తరగతి గదిలో పదో తరగతి విద్యార్థులు

ఇవీ నిబంధనలు

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 9,292 మంది విద్యార్థులు పదో తరగతి అభ్యసిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పరీక్ష ఫీజు ప్రభుత్వ పాఠశాలల్లో కంటే ఎక్కువగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కో విద్యార్థి పరీక్ష ఫీజు రూ.125 చెల్లించాలి. ఫీజు రాయితీ పొందాలంటే విద్యార్థులు తమ తల్లిదండ్రుల వార్షిక ఆదాయ ధ్రువపత్రం సమర్పించాల్సి ఉంటుంది. మొత్తం విద్యార్థుల్లో సుమారు 70 శాతం మేర బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఉంటారు. వీరు రాయితీ పొందేందుకు అవకాశం ఉన్నా.. తల్లిదండ్రుల ఆదాయం పట్టణ ప్రాంతాల వారికి రూ.24 వేలు, గ్రామీణ ప్రాంతాల వారికి రూ.20 వేలు ఉండాలనే నిబంధన ఉంది. సంక్షేమ పథకాల లబ్ధి పొందాలంటే గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలలోపు వార్షిక ఆదాయం ఉండాలని ప్రభుత్వ ఉత్తర్వులు పేర్కొంటున్నాయి. ఫీజు రాయితీ విషయంలో నిబంధనలు మార్చకపోవడంతో చాలామంది విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. రూ.125 ఫీజు రాయితీ కోసం ఆదాయ ధ్రువీకరణ పత్రం పొందాలంటే కనీసం రూ.100కు పైగా ఖర్చవుతుంది. పైగా వార్షిక ఆదాయం రూ.20 వేలతో ఎక్కడా ధ్రువీకరణ పత్రం ఇవ్వలేని పరిస్థితి. చాలామంది విద్యార్థులు ఫీజు రాయితీకి బదులు నేరుగా ఫీజు చెల్లిస్తున్నారు. ఫీజు రాయితీ విషయంలో ప్రభుత్వం నిబంధనలు మార్చాలని పలువురు విద్యార్థులు కోరుతున్నారు.

పాత నిబంధనలే కొనసాగుతున్నాయి

పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు కోసం రాయితీ విధానం పాతదే కొనసాగుతోంది. కొత్తగా నిబంధనలు ఏమీ మార్చలేదు. నిబంధనలు మార్చడం ప్రభుత్వ నిర్ణయమే.

– దామోదర్‌రావు, పరీక్షల నిర్వహణ అధికారి, మంచిర్యాల

విద్యాబోధనలో పోటీతత్వం అభినందనీయం

- జిల్లా విద్యాధికారి యాదయ్య

జన్నారం: విద్యాబోధనలో మండలంలోని ఉపాధ్యాయుల పోటీతత్వం అభినందనీయమని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. గురువారం మండలంలోని కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన టీచర్స్, పేరెంట్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోనే విద్యాబోధనకు మండలానికి ప్రత్యేకత ఉందని, గత కొన్నేళ్లుగా పదో తరగతి పరీక్షల్లో జిల్లాలో మొదటి స్థానంలో నిలుస్తోందని తెలిపారు. పదో తరగతి విద్యార్థుల చదువుపై శ్రద్ధ కనబర్చి ఈసారి కూడా ఉత్తీర్ణతలో జిల్లాలో మొదటి స్థానం రావాలని ఆకాంక్షించారు. కలమడుగు పాఠశాల ఉపాధ్యాయులు యూనిఫాం ధరించి వస్తూ విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. గ్రామానికి చెందిన కిషన్‌గౌడ్ పదో తరగతిలో పది పాయింట్లు సాధించగా రూ.10 వేలు బహుమతిగా ఇస్తానని హామీ ఇచ్చారు. తల్లిదండ్రుల సమావేశానికి 150మందికి పైగా తల్లిదండ్రులు హాజరు కావడంపై పాఠశాల హెచ్‌ఎం కట్ట రాజమౌళిని అభినందించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, సెక్టోరల్ అధికారులు చౌదరి, సత్యనారాయణమూర్తి, ఎంఈవో విజయ్‌కుమార్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజన్న, సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్య

తిర్యాణి అటవీ వైపు పులి అడుగులు

- పది రోజులుగా రాకపోకలు
- పాదముద్రలు గుర్తించిన అధికారులు

కాసిపేట: మండలంలోని అటవీ ప్రాంతం నుంచి పెద్దపులి తిర్యాణి అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్లు అటవీ అధికారులు నిర్ధారించారు. ఆదివారం వెంకటపూర్ అటవీ ప్రాంతంలో ఆవుపై దాడి చేసి చంపడంతోపాటు అదే ప్రాంతంలో సంచరిస్తున్నట్లు తెలియడంతో అధికారులు ఆనవాళ్ల కోసం ప్రయత్నించారు. దాడి చేసిన చోట రక్తం మినహా ఎటువంటి ఆనవాళ్లు లభించలేదు. సోనాపూర్ శివారు అటవీ ప్రాంతం నుంచి వెంకటపూర్ ప్రాంతంలో పాదముద్రలు గుర్తించారు. బెల్లంపల్లి, తిర్యాణి రేంజ్ అటవీ ప్రాంతంలోని ఎగ్గెండి వద్ద గురువారం పాదముద్రలు గుర్తించడంతోపాటు రెండు డివిజన్ల అధికారులు సమన్వయంతో ఎదులపాడు రేంజ్‌లో ప్రవేశించినట్లు గుర్తించారు. కాగా, లక్సెట్టిపేట, మంచిర్యాల, ముత్యంపల్లి అటవీ రేంజ్‌ల పరిధిలో గత పది రోజులుగా సంచరిస్తున్న పెద్దపులి తిర్యాణి వైపు వెళ్లడంతో ఈ ప్రాంతంలోనే ఆవాసం ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నట్లు అధికారులు భావిస్తున్నారు. పులి ఒకే మార్గంలో ప్రయాణిస్తోంది. వెళ్లిన దారి గుర్తించిన మరుసటి రోజు అదే దారిలో తిరిగి వచ్చే పాదముద్రలు లభిస్తున్నాయి. దీంతో రెండు ఉన్నాయా ఒక్కటే తిరుగుతోందా అనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. పాదముద్రలు ఒకే పులి చెందినవిగా గుర్తించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటివరకు ఈ ప్రాంతంలో పది రోజుల్లో ఆరు పశువులపై దాడి చేసి హతమార్చిందని, లక్సెట్టిపేట అటవీ ప్రాంతంలోకి వెళ్లిందని నిర్ధారించుకున్నారు. మూడు రోజులకు మళ్లీ పెద్దధర్మారం, దేవాపూర్ శివారు అటవీ ప్రాంతంలోకి రావడం, అక్కడ నిర్ధారించుకున్న మరుసటి రోజు వెంకటపూర్ అటవీ ప్రాంతంలోకి రావడంతో పులి ఈ ప్రాంతంలో ఒకే మార్గంలో ప్రయాణిస్తుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అటవీ అధికారులు గ్రామాల్లో అవగాహనతోపాటు పులి రక్షణకు పని చేస్తున్నారు.



ఎగ్గెండి వాగు ప్రాంతంలో పులి పాదముద్రలు

'కక్ష సాధింపుతోనే కూల్చివేతలు'

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మార్కెట్‌లో మున్సిపల్ అధికారులు ఎలాంటి టెండర్లు నిర్వహించకుండా, డీపీఆర్ సిద్ధం కాకముందే, బడ్జెట్ కేటాయింపులు లేకుండా వ్యాపారులపై కక్షతోనే కూల్చివేతలు, డ్రైనేజీ నిర్మాణం పేరిట తవ్వకాలు చేపడుతున్నారని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్డులో ఇటీవల మున్సిపల్ అధికారులు దుకాణ సముదాయాల ముందు కందకాలు తవ్వగా గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పేరిట కట్టడాలను కూల్చివేస్తున్నారని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయలేదనే ఈ చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, బీఆర్‌ఎస్ నాయకులు జూపాక సుధీర్, శ్రీరాముల మల్లేశ్, పడాల రవీందర్ పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలి

శ్రీరాంపూర్: ఈ ఆర్థిక సంవత్సరం శ్రీరాంపూర్ ఏరియా నిర్దేశించిన వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని కార్పొరేట్ కోల్ ప్రొడక్షన్ టార్గెట్ కమిటీ కన్వీనర్, జీఎం ఏ.మనోహర్ తెలిపారు. గురువారం సీసీసీ సింగరేణి గెస్ట్‌హౌస్ కాన్ఫరెన్సు హాల్‌లో టార్గెట్ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్పొరేట్ నుంచి వచ్చిన కమిటీ సభ్యులు ఏరియా ఇన్‌చార్జి జీఎం సత్యనారాయణ, ఇతర అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్షిక లక్ష్యాల సాధన కోసం ప్రత్యేకంగా కార్పొరేట్ స్థాయిలో టార్గెట్ కమిటీని ఏర్పాటు చేసుకుని ఎప్పటికప్పుడు బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ వెలికితీత లక్ష్యాలను సమీక్షిస్తున్నామని తెలిపారు. యంత్రాల పనిగంటలు పెంచుకోవాలన్నారు. కార్పొరేట్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ జీఎం సాయిబాబా, ఓపెన్ కాస్ట్ గనుల జీఎం సూర్యనారాయణరాజు, అండర్‌గ్రౌండ్ మైన్స్ జీఎం రఘురాంరెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇందారం ఓసీపీ అధికారి ఏవీ రెడ్డి పాల్గొన్నారు.



లక్ష్యాలపై సమీక్షిస్తున్న కార్పొరేట్ అధికారులు

కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి

పాతమంచిర్యాల: వాడ బలిజ కులస్తులకు వారి కులం పేరుతో కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని వాడ బలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దర్ర దామోదర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాడ బలిజ కులస్తులు నేటికీ అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నారని, ప్రభుత్వ ఫలాలు అందుకోలేక ఆర్థికంగా వెనుకబడ్డారని తెలిపారు. జిల్లాలో వాడ బలిజలకు అధికారులు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం లేదని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 9న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. దర్ర దామోదర్‌ను జిల్లా వాడబలిజ సేవా సంఘం అధ్యక్షుడు బోడెంకి మహేష్ ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గగ్గూరీ రాజన్న, గారె శంకర్, పానెం పరశురాం, కుమార్, బద్ది రాములు కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.



దామోదర్‌ను సన్మానిస్తున్న నాయకులు

క్వారీలో జంగల్ సఫారీ

- వన్యప్రాణుల సందర్శనకు 'గాంధారీ ఖిల్లా సఫారీ'
- కనువిందు చేయనున్న ప్రకృతి, అడవి అందాలు
- పర్యాటకంగా అభివృద్ధికి అటవీ శాఖ కసరత్తు
- మరో వారంలో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు


జంతువుల తాగునీటికి ఏర్పాటు చేసిన నీటికుంట

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎత్తయిన కొండలు.. దట్టమైన అటవీ ప్రాంతం.. పచ్చని అడవి.. పక్షుల కిలకిల రావాలు.. అందమైన నీటి కొలనులు.. వెరసి మంచిర్యాల జిల్లాలోని ఎంసీసీ క్వారీ జంగల్ సఫారీకి వేదిక కానుంది. ఇన్నాళ్లు ఎంసీసీ క్వారీ అంటే హాజీపూర్ మండలం గఢ్పూర్ గ్రామ పంచాయతీ పరిధి దుర్గాదేవి జాతర గుర్తుకు వచ్చేది. ఇక జంగల్ సఫారీకి ఆహ్వానించనుంది. మరో వారం రోజుల్లో గాంధారి ఖిల్లా సఫారీ ప్రారంభానికి అటవీశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్టు పరిధిలోని పాత మంచిర్యాల అటవీ బీట్ పరిధి హాజీపూర్ మండలం గఢ్పూర్ గ్రామ శివారులో ఎంసీసీ క్వారీలోని అటవీ ప్రాంతంలో సఫారీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పాతమంచిర్యాల, తిమ్మాపూర్, బొక్కలగుట్ట అటవీ బీట్ అడవుల పరిధిలో సఫారీ పర్యటన సాగనుంది. లక్సెట్టిపేట అటవీ రేంజ్ అధికారి అత్తె సుభాష్ ఆధ్వర్యంలో ఎఫ్ఎస్ఓ అతావుల్లా, ఎఫ్బీఓ రాజేందర్, సంతోష్ గురువారం సఫారీకి సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు. సఫారీ రూట్ మ్యాప్‌తోపాటు అడవిలో ఉన్న మంచెలు, నీటికుంటలు, వ్యూ పాయింట్లపై మరోసారి సమీక్షించి వచ్చే పర్యాటకులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్‌సింగ్, ఎఫ్‌డీఓ సర్వేశ్వర్ పత్యక్ష పర్యవేక్షణలో మరో వారం రోజుల్లో సఫారీని ప్రారంభించనున్నట్లు తెలిపారు.


పర్యాటకులు సేదదీరేలా ఏర్పాటు చేసిన మంచె

మంచెల ఏర్పాటు

జంగల్ సఫారీలో భాగంగా పర్యాటకులు అడవి అందాలు, వన్యప్రాణులను వీక్షించేందుకు ఆరు మంచెలు ఏర్పాటు చేశారు. వణ్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు ఐదు నీటికుంటలు ఏర్పాటు చేసి వాటిలో నీరు నింపేందుకు సోలార్ సబ్ మెర్సిబుల్ పంప్ సెట్‌తో బోర్ వేయించారు. 20 కిలోమీటర్ల మేర సఫారీ ట్రాక్, ట్రాక్ మధ్యలో 24 మీటర్ల వెడల్పుతో పిచ్చి మొక్కల తొలగింపు చేపట్టారు. పనుల కోసం రూ.25 లక్షలు ఖర్చు చేస్తున్నారు. క్వారీ నుంచి గాంధారీ ఖిల్లా, నీటికుంటలు, అటవీ జంతువులు, అటవీ అందాలను వీక్షించవచ్చు. జంగల్ సఫారీకి ఒక్కో టిప్పుకు రూ.2 వేల వరకు రుసుం ఉండనున్నట్లు సమాచారం.


ఎంసీసీ క్వారీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అటవీ రేంజ్ అధికారి సుభాష్

వన్యప్రాణులు..

అటవీ ప్రాంతంలో శాఖాహార, మాంసాహార జంతువులు, వివిధ రకాల వణ్యప్రాణులు ఉన్నాయి. పెద్దపులి, చిరుత పులులు, ఎలుగుబంట్లు, అడవి బర్రెలు, దుప్పులు, మెఖములు, చుక్కల దుప్పులు, అడవి కుక్కలు, నక్కలు, సాంబర్‌లు, అడవి పందులు, నెమళ్లు ఉన్నాయని అటవీ అధికారులు తెలిపారు. క్వారీకి వెళ్లే మార్గంలో ఎత్తయిన గుట్టల నుంచి తీసిన రహదారి, మూలమలుపులు, పచ్చని చెట్లు అలరిస్తాయి. ఎంసీసీ పరిశ్రమ గుట్టలపై ఉన్న చెట్లలో పార్కుల నిర్మాణం చేపట్టి పిక్నిక్ స్పాట్‌గా మార్చింది. ఆదివారం వచ్చిందంటే చాలు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చి సేద తీరుతారు. ఇప్పటికే జిల్లాలోని జన్నారం కవ్వాల్ అభయారణ్యంలో జంగల్ సఫారీకి పర్యాటకులు వస్తుంటారు.

కెమెరాకు చిక్కిన పులి..

ఇటీవల సఫారీ ఏర్పాట్లలో భాగంగా రోడ్డు మార్గంలో ఏర్పాటు చేసిన కెమెరాకు అడవిలోకి వెళ్తున్న పులి చిక్కింది. హాజీపూర్ మండల పరిధిలోని అటవీ శివారుల ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. కెమెరాకు చిక్కిన పులి చిత్రాలను అటవీ అధికారులు గురువారం విడుదల చేశారు.

వారంలో ప్రారంభం



అడవి అందాలు, వణ్యప్రాణులతోపాటు చారిత్రాత్మక ప్రాంతమైన గాంధారీ ఖిల్లాను వీక్షించేందుకు క్వారీలోని అడవుల్లో 20 కిలోమీటర్ల మేర జంగల్ సఫారీ ఏర్పాటు చేస్తున్నాం. వారం రోజుల్లో ప్రారంభించేలా కసరత్తు చేస్తున్నాం. నిత్యం 50 మంది కూలీలు, యంత్రాల సహాయంతో సఫారీ ట్రాక్ పూర్తి చేయించగా అటవీలో ఎలాంటి చెత్త లేకుండా పనులు పూర్తి చేయిస్తున్నాం.

– అత్తె సుభాష్, అటవీ రేంజ్ అధికారి

పెన్‌గంగ తీరంలో భక్తుల సందడి


ఉత్సవ మూర్తులకు చక్రస్నానం

తాంసి(బోథ్): భీంపూర్ మండలంలోని వడూర్ శివారులో ఉన్న పెన్‌గంగ నదీ తీరం వద్ద గురువారం భక్తుల సందడి నెలకొంది. కార్తీకమాస పూజల్లో భాగంగా భక్తులు గంగానదిలో చక్రస్నానాలు ఆచరించారు. ఉదయం హోమంతో పాటు పెన్‌గంగలో శ్రీసీతారామచంద్రుల ఉత్సవ మూర్తులకు భక్తజనుల మధ్య వైభవంగా చక్రస్నానం చేయించారు. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పక్కనే ఉన్న మహారాష్ట్ర నుంచి పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో నదీతీరం భక్తజనంతో సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ప్రోగ్రాం నిర్వాహకుడు చిల్కూరి సంజీవ్ రెడ్డి, గ్రామపెద్దలు నితిన్, ఉల్లాస్ పటేల్, భక్తులు పాల్గొన్నారు.


చక్రస్నానానికి ఉత్సవమూర్తులు

బాలికల వాలీబాల్ ఎంపిక పోటీలు

దండేపల్లి: స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని రెబ్బనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి అండర్–14 బాలికల వాలీబాల్ ఎంపిక పోటీలు గురువారం నిర్వహించారు. పోటీలను పాఠశాల హెచ్ఎం రాజు ప్రారంభించారు. నాలుగు జిల్లాల నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో మంచిర్యాల జిల్లా జట్టు ప్రథమ, ఆదిలాబాద్ జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో వెలనూర్ కాంప్లెక్స్ హెచ్ఎం విజయలక్ష్మి, నాయకులు మురళీకృష్ణ, అశోక్, శేఖర్, ప్రసాద్, ఎస్‌జీఎఫ్ మంచిర్యాల జిల్లా సెక్రెటరీ ఫణిరాజా పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు డయల్ యువర్ ఆర్ఎం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో శుక్రవారం డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ సోలోమన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు తమ సమస్యలు, సలహాలు, సూచనలు చేయవచ్చని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు కొనసాగే ఈ కార్యక్రమానికి 9959226000 సెల్ నంబరులో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు డయల్ యువర్ మంచిర్యాల డీఎం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 15న డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నట్లు డీఎ జనార్దన్ తెలిపారు. ప్రయాణికుల సమస్యలతోపాటు సందేహాలు నివృత్తి చేసుకోవడం.. సలహాలు ఇచ్చేందుకు 9959226004 ఫోన్ నంబరులో సంప్రదించాలని తెలిపారు.

ఆటో బోల్తా.. ఒకరి దుర్మరణం

- నలుగురికి స్వల్పగాయాలు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడ శివారు ప్రాంతాంలో గల డంపింగ్ యార్డు సమీపంలోని మొరం క్వారీలో అదుపుతప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో ఓ మహిళా కూలీ దుర్మరణం చెందింది. స్థానికులు, ఎస్సై ముజాహిద్ కథనం ప్రకారం.. బంగారుగూడకు చెందిన నలుగురు వ్యవసాయ కూలీలు రోజు మాదిరిగానే గురువారం వ్యవసాయ కూలీ పనులకు ఆటోలో వెళ్తున్నారు. మార్గమధ్యలో డంపింగ్‌యార్డు సమీపంలో రోడ్డు పక్కన ఉన్న మొరం తవ్విన క్వారీలో వర్షపు నీరు నిల్వ ఉంది. ఆటో అదుపుతప్పి అందులో పడిపోవడంతో ఊపిరాడక కవిత మోరె (34) అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురిని అటువైపు నుంచి వెళ్తున్న కచికంటి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దోతి అందించి ప్రాణాలు కాపాడాడు. డ్రైవర్‌తో పాటు ముగ్గురు వ్యవసాయ కూలీలు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. మృతురాలి భర్త దీపక్ మోరె ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ సయ్యద్ నజీంపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం


దగ్ధమైన దుకాణం

ఇంద్రవెల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మండల కేంద్రంలోని దుకాణం దగ్ధమైంది. స్థానికులు, దుకాణం నిర్వాహకుడు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని మిలింద్‌నగర్‌కు చెందిన మోతివార్ శాంభ వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో ప్రధాన రహదారి పక్కనే చాయ్, చెప్పులు, కూల్‌డ్రింక్స్ దుకాణం నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి దుకాణం బంద్ చేసి ఇంటికి వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి దుకాణం దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎస్సై దుబ్బాక సునీల్‌తో పాటు రెవెన్యూ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదంలో రూ.2 లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఎస్ఎస్‌పీసీ హైదరాబాద్ ఎల్‌జీ హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమి ఆధ్వర్యంలో గ్యాస్ చార్జింగ్, ఎయిర్ కండీషనర్ ఇన్స్టాలేషన్, వాటర్ ప్యూరిఫైయర్ నిర్వహణ, మరమ్మతులు, తదితర విభాగాల్లో ఉచిత శిక్షణతో పాటు వసతి సౌకర్యం కల్పించనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం రూ.15 వేల నుండి 20 వేల వేతనంతో కూడిన ఉపాధి కల్పించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 16 నుంచి 25 వరకు ఉట్నూర్ ఐటీడీఏలోని గిరిజన శిక్షణ ఉపాధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 62816 67501 నంబరులో సంప్రదించాలన్నారు.

బొగ్గు నాణ్యత పాటించాలి

శ్రీరాంపూర్: బొగ్గు నాణ్యత ప్రమాణాలు పాటించాలని శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఓటు జీఎం యస్.సత్యనారాయణ తెలిపారు. గురువారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో బొగ్గు నాణ్యత వారోత్సవాలు ప్రారంభించారు. నాణ్యత ప్రమాణాల జెండా ఆవిష్కరించారు. అధికారులు, ఉద్యోగులతో బొగ్గు నాణ్యత పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఏరియా రక్షణ అధికారి శ్రీధర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ కాస్ట్ గనిలో..

శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో బొగ్గు నాణ్యత వారోత్సవాలు నిర్వహించారు. గని మేనేజర్ బ్రహ్మాజీ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. గని రక్షణాధికారి సంపత్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ నల్లపు సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.


జీఎం కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి

మందమర్రిరూరల్: సింగరేణిలో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేస్తూ వినియోగదారులకు విక్రయిస్తోందని ఏరియా ఇన్‌చార్జి జీఎం విజయ్‌ప్రసాద్ అన్నారు. గురువారం బొగ్గు నాణ్యత వారోత్సవాల్లో భాగంగా ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు.


శివాజీ చౌక్‌లో చంకన చంటిపాపను ఎత్తుకొని యాచిస్తున్న చిన్నారి


సిగ్నల్స్ వద్ద ఆగి ఉన్న వాహనదారులను యాచిస్తున్న బాలిక


జిల్లా కేంద్రంలోని ఈద్గాం చౌరస్తాలో పాత సామాన్ల విక్రయానికి వచ్చిన బాలిక

ఈ 'బాలల'కు ఏదీ సంబురం?

భారత తొలి ప్రధాని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా నవంబర్ 14న ఏటా బాలల దినోత్సవం నిర్వహిస్తారు. పాఠశాలల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. గురువారం అన్ని పాఠశాలల్లో విద్యార్థులు సంబురాలు చేసుకుంటుంటే.. వీధి బాలలు మాత్రం వేడుకలకు దూరంగా ఉన్నారు. కొందరు నిర్మల్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఇలా భిక్షాటన చేస్తూ, మరికొందరు బాల కార్మికులుగా, ఇంకొందరు చెత్త ఏరుతూ కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

గంజాయి ముఠా అరెస్టు

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి రవాణా
- వివరాలు వెల్లడించిన ఏసీపీ వెంకటేశ్వర్లు

జైపూర్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి అక్రమంగా జిల్లాకు గంజాయి రవాణా చేస్తున్న ముఠాను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నలుగురి వ్యక్తులను అరెస్టు చేసి 1.380 కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జైపూర్ అసిస్టెంట్ కమిషనరేట్‌లో ఏసీపీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు మంచిర్యాల–చెన్నూర్ 63వ జాతీయ రహదారిపై నర్వగ్రామ శివారులో పోలీసులు తనిఖీ చేపట్టారు. పోతారాజుల ఆకాశ, దూట రాజ్‌కుమార్, షేక్ అఫ్రీది, తోట ప్రశాంత్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా భద్రాద్రికొత్తగూడెం జిల్లా సీలేరు గ్రామం నుంచి గుర్తు తెలియని వ్యక్తి నుంచి గంజాయి తెచ్చి జైపూర్ మండల చుట్టుపక్కల గ్రామాల్లో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. వచ్చిన డబ్బుతో మద్యం తాగి జల్సాలు చేస్తున్నట్లుగా పేర్కొన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్సై శ్రీధర్ పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ వేణుచందర్

చోరీకి యత్నించిన వ్యక్తిపై కేసు

లోకేశ్వరం: మండలంలోని నగర్ గ్రామంలోని ఊరు చివరలో ఉన్న లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో చోరీకి ప్రయత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఆలయంలో బుధవారం రాత్రి గర్భగుడి తాళం, జగదాంబ ఆలయం హుండీ తాళం గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టారని పూజారి రామానుజంస్వామి గ్రామస్తులకు, లోకేశ్వరం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై అశోక్ గురువారం ఉదయం ఆలయానికి వచ్చి సీసీ పుటేజీలు పరిశీలించాడు. ఇందులో అదే గ్రామానికి చెందిన మీసాల ఎల్లగౌడ్ ఆలయం తాళం, హుండీ తాళం పగలగొట్టిన దృశ్యాలు రికార్డు అయ్యాయి. వీటి ఆధారంగా ఎల్లగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.


హుండీని పరిశీలిస్తున్న లోకేశ్వరం ఎస్సై అశోక్

ముగిసిన జోనల్‌స్థాయి క్రీడలు

- బహుమతులు ప్రదానం చేసిన కలెక్టర్

ముధోల్: ముధోల్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల మైదానంలో నాలుగు రోజులపాటు నిర్వహించిన జోనల్‌స్థాయి క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. సాయంత్రం ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ అభిలాష అభినవ్ హాజరయ్యారు. ముందుగా విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు అన్నిరంగాల్లో ప్రతిభ కనబర్చాలని సూచించారు. విద్యార్థి దశ చాలా కీలకమైనదని, ఈ దశలో విద్యార్థులు తమకు నచ్చిన రంగంలో ప్రతిభ చూపాలన్నారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం పెరుగుతాయని తెలిపారు. పోటీ తత్వం పెరుగుతుందన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను అభినందించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల యాజమాన్యం కలెక్టర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావుపటేల్, బాసర జోన్ అధికారి పీఆర్ ఫ్లోరెన్స్ రాణి, డీసీవో ప్రశాంతి, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ చల్ల నరసింహారెడ్డి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నిరంజన్, పీఈటీలు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న కలెక్టర్

సింగరేణి ఏరియా ఆస్పత్రిలో షార్ట్‌సర్క్యూట్

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో గురువారం తెల్లవారుజామున విద్యుత్ షాట్ సర్క్యూట్ జరిగింది. ఆకస్మికంగా చోటు చేసుకున్న ఈ ఘటనతో సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం స్పెషల్ వార్డు ఏర్పాటు చేశారు. ఈ వార్డు నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో సిబ్బంది అప్రమత్తం అయ్యారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ మధుకర్ సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పి వేశారు. గది పైకప్పు, ఏసీ మిషన్ కాలిపోయాయి. సింగరేణి అధికారులు ప్రమాదం వివరాలు తెలుసుకున్నారు. మూడు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన వైర్లు కావడంతో ప్రమాదం జరిగి ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ కరెంట్ వైరింగ్ సరిగా లేక గోడలపై నీళ్లు రావడంతో కరెంట్ షాక్ వచ్చిన సంగతి తెలిసిందే. సింగరేణి ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సమస్యలు, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


కాలిపోయిన స్పెషల్ వార్డు గది పైకప్పు

ఇద్దరు వ్యక్తులపై కేసు

కాసిపేట: మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన షేక్‌గౌస్, షేక్ షబీర్‌లపై గురువారం కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ పున్నంచంద్ తెలిపారు. ఈ నెల 13న దేవాపూర్ పాత అంగడిబజార్‌లో ఉన్న యువతికి వరుసకు మామ అయిన షేక్‌గౌస్ ఫోన్ చేసి ఆమె అన్న, మేనమామకు జరిగిన గొడవ విషయం మాట్లాడాలని, పీరీల బంగ్లా వద్దకు రావాలని చెప్పాడని తెలిపారు. యువతి రాగానే గౌస్ అతడికి వరుసకు తమ్ముడు అయ్యే షబీర్ ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించారని, బాధితురాలు ఫిర్యాదు చేసిందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎదులాపురం: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు వన్‌టౌన్ ఎస్సై అశోక్ తెలిపారు. పట్టణంలోని రవీంద్రనగర్‌కు చెందిన సామ అమరేందర్‌రెడ్డి ఈనెల 13న ఇంటికి తిరిగివస్తుండగా విద్యార్థి కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. అతనికి గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించారు. గురువారం ఉదయం క్షతగాత్రుని భార్య రాధిక ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అశిష్ యాక్సిడెంట్ చేసినట్లుగా గుర్తించామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.